Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శనివారం
17 ఆగస్టు 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 103
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## జమ్మూ కశ్మీర్, హర్యానా ఎన్నికల షెడ్యూల్




- మొదటి ఫేజ్ ఎన్నికలు సెప్టెంబర్ 18వ తేదీన ఎన్నికలు
- మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరగనుందని ఈసీ వెల్లడి
- ఇక రెండో విడత సెప్టెంబర్ 25న, మూడో విడత ఎన్నికలు అక్టోబర్ 1న
- ఆగస్టు 20వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వెల్లడి

## 70వ నేషనల్ ఫిల్మ్ అవార్డుల ప్రకటించిన కేంద్రం




- 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన సినిమాలకు పురస్కారాలు
- దేశవ్యాప్తంగా మొత్తం 28 భాషలలో విడుదలైన 300కు పైగా సినిమాల నుంచి అందిన నామినేషన్లు
- ఉత్తమ తెలుగు చిత్రంగా కార్తికేయ 2, ఉత్తమ తమిళ చిత్రంగా పొన్నియన్ సెల్వన్, ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్ 2 చిత్రాలు



## మహానగరంపై మత్తు మరక

- గచ్చిబౌలిలో రూ.4 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత
- ఎనిమిది మంది స్మగ్లర్ల అరెస్టు
- 620 గ్రాముల హెరాయిన్ సీజ్..
- రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు రవాణా

శుభ తెలంగాణ హైదరాబాద్

గంజాయి, డ్రగ్స్‌పై తెలంగాణ పోలీసులు ఉక్కుపాదం మోపినా సరే..! మహానగరంపై మత్తు మరక చెరిగిపోవడంలేదు. వారం రోజులుగా ఎక్కడో ఓ చోట పట్టుబడుతూనే ఉంది. తాజాగా మారోసారి డ్రగ్స్ పట్టుబడటం కలకలం సృష్టించింది. ఈసారి దొరికింది రాజస్థాన్‌కు చెందిన బడా గ్యాంగ్.మత్తును చిత్తు చేద్దాం.. డ్రగ్స్ రహిత తెలంగాణను సాధిద్దాం. ఈ స్లోగన్‌తో ఓవైపు తెలంగాణ సర్కార్ యుద్ధం చేస్తుంటే, - మిగతా3లో


## ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్!

- సీఎం రేవంత్‌రెడ్డితో ఫాక్స్‌కాన్ చైర్మన్ భేటీలో చర్చ
- మరో ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో సంస్థ
- ఫోర్త్ సిటీ రూపకల్పనలో మీ విజన్ అద్భుతం
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా: యాంగ్ లియూ



శుభ తెలంగాణ హైదరాబాద్/న్యూఢిల్లీ

అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజ సంస్థ 'ఫాక్స్‌కాన్'... తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొంగరకలాన్ వద్ద ఆ సంస్థకు సంబంధించిన ఓ ప్లాంటు సిద్ధమవుతుండగా.. అదనంగా మరో ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో ఉందని సమాచారం. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ నేతృత్వంలోని సంస్థ ప్రతినిధి బృందం - మిగతా3లో



## హిందువులకు రక్షణ కల్పిస్తాం..

- మోదీకి ఫోన్ చేసిన బంగ్లా సారథి యూనస్
- బంగ్లాదేశ్ తాత్కాలిక పాలకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చింది: మోదీ
- బంగ్లాదేశ్ లో ప్రస్తుత పరిణామాలపై ఇద్దరం మాట్లాడుకున్నామన్న మోదీ
- హిందువులకు భద్రత కల్పిస్తామని యూనస్ హామీ ఇచ్చారని వెల్లడి
- శాంతియుత ప్రభుత్వానికి భారత్ మద్దతు ఉంటుందన్న ప్రధాని

## రేవంత్ రెడ్డి అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడు

- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్
- మాకు రాజీనామాలు కొత్త కాదు.. రేవంత్ రెడ్డికి మోసాలు కొత్త కాదు
- రేవంత్ రెడ్డికి ఆ సంస్కారం ఉందా?
- సీఎం మీద చీటింగ్ కేసు పెట్టాలి
- దమ్ముంటే కొడంగల్‌కు రా.. రుణమాఫీపై చర్చ పెడదాం..
- సీఎం రేవంత్ రెడ్డి ఫ్రస్ట్రేషన్‌లో రంకెలు వేస్తున్నారు
- అడ్డమైన ఆంక్షలు, అర్థంలేని షరతులతో.. అన్నదాతలను నిండా ముంచారు..




శుభ తెలంగాణ హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్ వేశారు. బీజేపీలో బీఆర్ఎస్ త్వరలోనే విలీనం అవుతుందని, ఆ వెంటనే కేసీఆర్ గవర్నర్, కేటీఆర్ కేంద్రమంత్రి కాబోతున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని వ్యంగ్యంగా మాట్లాడారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్ - మిగతా3లో


## రాష్ట్రంలో 24 గంటల పాటు ఓపీ సేవలు బంద్

- కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా..
- ఐఎంఏ పిలుపుతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిపివేత
- నేడు ఉదయం 6 నుంచి రేపొద్దున ఆరు గంటల దాకా
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి: వైద్య మంత్రి దామోదర
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసనలు, ఆందోళనలు
- ఆర్జీ కర్‌పై దాడి.. బెంగాల్ సర్కారు వైఫల్యం వల్లే!
- 7వేల మంది గుమిగూడితే ఇంటెలిజెన్స్ ఏం చేస్తోంది?
- హత్యాచారం జరిగిన ఫ్లోర్‌లోనే మరమ్మతులేమిటి?
- ఆస్పత్రిని మూసేయిస్తాం.. జాగ్రత్త: కోల్‌కతా హైకోర్టు
- వైద్యసిబ్బందిపై దాడి జరిగిన 6 గంటల్లోపు ఎఫ్ఐఆర్..



శుభ తెలంగాణ హైదరాబాద్

జూనియర్ డాక్టర్‌పై కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో జరిగిన హత్యాచారానికి నిరసనగా.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ఆందోళనలు చేపట్టారు. ధర్నాలతో పాటు నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ.. 24 గంటలపాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యసేవలు మినహా.. ఓపీ వైద్యసేవలను నిలిపివేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపునిచ్చింది. ఈ మేరకు డాక్టర్ల - మిగతా3లో



## అతి త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం తథ్యం

- కేసీఆర్‌కు ఏఐసీసీ.. కేటీఆర్‌కు పీసీసీ చీఫ్.. కవితకు రాజ్యసభ సీటు ఖాయం..!
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- కవిత బెయిల్ పై కావాలనే బీజేపీపై కాంగ్రెస్ దుష్ప్రచారం
- కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్ లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు?

శుభ తెలంగాణ హైదరాబాద్

బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుని పదవులు పంచుకున్న చరిత్ర ఆ పార్టీల సొంతం కవిత బెయిల్‌కు బీజేపీకి ఏం సంబంధం? బీఆర్ఎస్‌ను విలీనం చేసుకుంటే బెయిల్ - మిగతా3లో



## ఎమ్మెల్సీలుగా ప్రొ కోదండరాం, ఆమిర్ అలీఖాన్ ప్రమాణం

- గతంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను సిఫార్సు చేస్తూ అప్పటి ప్రభుత్వం గవర్నర్‌కు ప్రతిపాదనలు
- అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వాటిని తిరస్కరించారు
- అప్పటి గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు

శుభ తెలంగాణ హైదరాబాద్

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్, ప్రభుత్వం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి - మిగతా3లో

# 70వ నేషనల్ ఫిల్మ్ అవార్డుల ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన సినిమాలకు పురస్కారాలు అందిస్తుంది కేంద్రం. దేశవ్యాప్తంగా మొత్తం 28 భాషలలో విడుదలైన 300కు పైగా సినిమాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది. ఉత్తమ తెలుగు చిత్రంగా కార్తికేయ 2, ఉత్తమ తమిళ చిత్రంగా పొన్నియన్ సెల్వన్, ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్ 2 చిత్రాలు నిలిచాయి. ఉత్తమ తెలుగు చిత్రం : కార్తికేయ–2 ? ఉత్తమ కన్నడ చిత్రం : కేజీఎఫ్–2 ? ఉత్తమ తమిళ చిత్రం : పొన్నియిన్ సెల్వన్ పార్ట్–1 ? ఉత్తమ మ్యూజికల్ డైరెక్టర్ రహమాన్ (పొన్నియన్ సెల్వన్–1) ? ఉత్తమ సౌండ్ డిజైన్ ? పొన్నియన్ సెల్వన్ ? బెస్ట్ సినిమాటోగ్రఫీ– పొన్నియన్ సెల్వన్ ? ఉత్తమ సహాయనటి నీనా గుప్తా ? ఉత్తమ సహాయనటుడు పవన్ రాజ్ మల్హోత్రా ? ఉత్తమ ఫిల్మ్ క్రిటిక్–దీపక్ దువా (హిందీ) ? బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్.. కుచ్ ఎక్స్ ప్రెస్.. గుజరాతీ, నిక్కిజోషి. ? బెస్ట్ మ్యూజిక్.. బ్రహ్మాస్త్ర.. శివ (హిందీ) ప్రీతమ్ ? ఉత్తమ సంగీతం నేపథ్యం.. పొన్నియన్ సెల్వన్ 1.. తమిళ్.. మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్. ? బెస్ట్ రైటర్.. గుల్ మోహర్ : అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టెల ? బెస్ట్ యాక్షన్ డైరెక్షన్.. అన్బరివు.. కేజీఎఫ్ 2 ? బెస్ట్




కొరియోగ్రఫీ.. జానీ మాస్టర్, సతీశ్ష్ కృష్ణన్ తిరుచిత్రాంబళం తమిళ్.. ? బెస్ట్ లిరిక్స్.. ఫౌజా..(హరియాన్వీ), రచయిత.. నౌషద్ సదర్ ఖాన్. ? బెస్ట్ స్క్రీన్ ప్లే (ఒరిజినల్).. ఆట్టం.. ఆనంద్ ఏకార్షి.

**ఒకే ఏడాది రెండోసారి**


ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులకు, చిత్రాలకు పురస్కారాలు ప్రకటిస్తుంది. ఆ విషయం ప్రేక్షకులకూ తెలుసు. అది ఆనవాయితీ కూడా! అయితే, ఈ రోజు (ఆగస్టు 16, 2024) అనౌన్స్ చేశారు. మళ్ళీ ఇయర్ ఎండ్ – 2024 ఆఖరులో ఇంకోసారి అనౌన్స్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఆల్రెడీ ఈ రోజు అనౌన్స్ చేశారు కదా! మళ్ళీ ఎందుకు అంటే... : ఇవాళ విడుదలైన నేషనల్ అవార్డ్స్ కొంత మంది ప్రేక్షకులకు షాక్ ఇచ్చాయి. ఎందుకు? అంటే... ఆ సినిమాలు ఏవీ లాస్ట్ ఇయర్ రిలీజ్ (కొన్ని మినహాయిస్తే) అయినవి కాదు. రెండేళ్ల క్రితం... అంటే 2022లో రిలీజ్ అయ్యాయి. కొన్ని అప్పటికి సెన్సార్ పూర్తి చేసుకున్నవి. సాధారణంగా గత ఏడాది డిసెంబర్ వరకూ సెన్సార్ పూర్తి చేసుకున్న సినిమాలకు ఈ ఏడాది పురస్కారాలు అనౌన్స్ చేస్తారు. మరి, రెండేళ్ల క్రితం వచ్చిన సినిమాలకు ఎందుకు అనౌన్స్ చేశారంటే... కరోనా కారణంగా పురస్కారాలకు మధ్యలో కొంత విరామం వచ్చింది. రెండేళ్లు గ్యాప్ వచ్చింది. అందువల్ల, అవార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక, ప్రకటన వంటివి ఆలస్యం అవుతూ వచ్చాయి. ఈ గ్యాప్ కవర్ చేయడం కోసం 2023 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ పూర్తి చేసుకున్న సినిమాలకు ఈ ఏడాది ఆఖరులో అవార్డులు అనౌన్స్ చేయాలని భావిస్తున్నట్టు నేషనల్ అవార్డ్స్ కమిటీ జ్యూరీ సభ్యురాలు ఒకరు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు, జాతీయ చలన చిత్ర పురస్కారాల కమిటీ సభ్యుల ఆలోచన ఒక్కటే... వచ్చే ఏడాదికి ఎటువంటి గ్యాప్ ఉండకూడదు. 2025లో అనౌన్స్ చేసే 72వ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ 2024లో విడుదలైన సినిమాలకు ఇవ్వాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకే, 2024 ఏడాది ఆఖరులో మరోసారి అవార్డులు ఇస్తున్నారు.


# హిందువులకు రక్షణ కల్పిస్తాం..

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులపై జరుగుతున్న దాడులపై భారత్ సహా అంతర్జాతీయ సమాజం నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ఫోన్ చేశారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితిపై పరస్పరం సంభాషించుకున్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆ విషయాన్ని మోదీ వెల్లడించారు.

''బంగ్లాదేశ్ ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్ ప్రొఫెసర్ మమహ్మద్ యూనస్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అక్కడి పరిస్థితిపై ఇద్దరూ మాట్లాడుకున్నాం. ప్రజాస్వామిక, సుస్థిర, శాంతియుత, ప్రగతశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతుగా ఉంటుందని పునరుద్ఘాటించాను. బంగ్లాలోని హిందువులు, మైనారిటీలకు భద్రత కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు'' అని మోదీ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పడిపోవడానికి దారితీసిన అల్లర్లు, హింసాత్మక ఘటనలు, మైనారిటీ ఆస్తులపై దాడుల నేపథ్యంలో యూనుస్, మోదీ ఫోనులో సంభాషించుకోవడం ఇదే మొదటిసారి.


బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వాజయిర్‌గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంంగా 84 ఏళ్ల నోబెల్ గ్రహీత యూనస్‌కు ప్రధాని ఇటీవల అభినందనలు తెలిపారు. మైనరిటీలు, ముఖ్యంగా హిందువులపై దాడుల ఘటనలు పెరగడంపై ఈ సందర్భంగా మోదీ ఆందోళన తెలియజేశారు.





గురువారంనాడు భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం చేసిన ప్రసంగంలో కూడా బంగ్లా అంశాన్ని మోదీ ప్రస్తావించారు. బంగ్లాలో మైనారిటీలైన హిందువుల భద్రత విషయంలో 140 కోట్ల మంది భారతీయులు ఆందోళనలో ఉన్నారని, బంగ్లా శ్రేయస్సును నిరంతరం ఆశించే భారత్ అక్కడ పరిస్థితితులు సాధారణ స్థితికి వస్తాయని ఆశిస్తోందని చెప్పారు. బంగ్లాలో మైనారిటీలు, హిందువులు సురక్షితంగా ఉండాలని కోరుకుంటోందని అన్నారు. యూనస్ సైతం ఇటీవల ఢాకాలో హిందూ దేవాలయాన్ని సందర్శించి అక్కడి హిందూ మత పెద్దలను కలుసుకున్నారు. మతమేదైనా మానవులంతా ఒక్కటేనని, హక్కులు అందరికీ సమానమేనని, ప్రజలంతా సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు.

## ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఇచ్చిన ఫరూక్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీఐ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల్లో పోటీపై నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా స్పష్టత ఇచ్చారు. తాను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఎన్నికలు జరపాలని తాను పదేపదే కోరుతూ వస్తున్నానని, రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి చాలా కాలమైందని ఫరూక్ అబ్దుల్లా ఉన్నారు. ప్రజా ప్రతినిధులు ఉంటేనే సమస్యలు పరిష్కరమవుతాయని చెప్పారు. ప్రస్తుతానికి అయితే, నేషనల్ కాన్ఫరెన్స్ ఒంటరిగా ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటోందని ఆయన తెలిపారు. ఇతర పార్టీలు పొత్తులతో ఎన్నికకు వెళ్తాయా, లేదా అనేది తనకు తెలియదని చెప్పారు.

**ఒమర్ పోటీ చేయరు..**

అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని, అయితే తన కుమారుడు ఒమర్ అబ్దుల్లా మాత్రం జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంత వరకూ పోటీ చేయనని చెబుతున్నారని ఫరూక్ తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్రప్రతిపత్తి వచ్చిన వెంటనే ఒమర్ పోటీ చేస్తారని చెప్పారు. ఒమర్‌కు తన సీటు ఖాళీ చేసి ఇస్తానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

## వైద్యురాలి హత్యాచార ఘటనలో సీబీఐకి సహకరించాలి

కోల్‌కతాలో ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వైద్యురాలి హత్యాచార కేసు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనలో మమతా బెనర్జీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆరోపించారు. ఘటనా స్థలంలోకి పెద్దసంఖ్యలో సంఘ విద్రోహ శక్తులు ప్రవేశించి ఆధారాలను మాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న తీరు అత్యంత హేయమని అన్నారు. నిందితులను కాపాడాలని కొందరు కోరుకుంటున్నారని ఈ ఘటనలతో వెల్లడవుతున్నదని చెప్పారు. ఆధారాలు చెరిగిపోకుండా కాపాడాల్సిన బాధ్యత మమతా బెనర్జీ సర్కార్‌పై ఉందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఆరోపణలు గుప్పించే బదులు పశ్చిమ బెంగాల్ సీఎం సీబీఐ బృందానికి సహకరించాలని, ఆధారాలు కాపాడేలా చొరవ చూపాలని చిరాగ్ పాశ్వాన్ హితవు పలికారు. వైద్యురాలిపై హత్యాచార ఘటన పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబుకుతున్నదని చెప్పారు. కాగా, వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సిలిగురి ఎమ్మెల్యే, రాష్ట్ర అసెంబ్లీ చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ డిమాండ్ చేశారు. బెంగాల్‌లో మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కందుని, పార్క్ స్ట్రీట్, మతిగర, చోప్రా, అరియదహ, కలియాగంజ్, హంష్ఖలి సహా పలు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని నడపడంలో విఫలమయ్యారని వెల్లడవుతున్నదని చెప్పారు. ఆర్జీ కార్ ఘటన అనంతరం ఘటనా స్థలం మీడియా కంటపడకుండా సీఎం ప్రయత్నించారని ఆరోపించారు. మహిళలపై తీవ్ర నేరాలు పెచ్చుమీరుతున్నాయని, దీదీ సర్కార్ హయాంలో మహిళలకు భద్రత కరవైందని వ్యాఖ్యానించారు. నిందితులను పట్టుకున్నా వారిని కఠినంగా శిక్షించడం లేదని ఆరోపించారు.




## ఈజిప్ట్ షిప్ నిర్బంధానికి.. హైకోర్టు ఆదేశం

**భువనేశ్వర్:** ఈజిప్ట్ దేశానికి చెందిన కార్గో షిప్‌ను నిర్బంధించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నిర్బంధాన్ని పర్యవేక్షించడానికి స్థానిక కోర్టు సీనియర్ న్యాయమూర్తిని అడ్మిరల్‌గా నియమించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ నౌక అరెస్ట్‌లో ఉంటుందని పోర్ట్ అధికారులు తెలిపారు. ఈజిప్ట్‌కు చెందిన ఎంవీ వాడి అల్ఫోస్తాన్ ఆగస్ట్ 6న ఒడిశాలోని పారాదీప్ పోర్ట్‌కు చేరుకుంది. అక్కడి నుంచి 55,000 మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని చైనాకు రవాణా చేయాల్సి ఉంది. కాగా, తక్కువ సల్ఫ్యూరిక్ మెరైన్ గ్యాసోయిల్ రవాణాకు సంబంధించి జర్మన్ కంపెనీ ఒడిశా హైకోర్టును ఆశ్రయించింది. తమకు రూ.3.96 కోట్ల రుణం బకాయి ఉన్నందున ఆ ఈజిప్ట్ షిప్‌ను స్వాధీనం చేసుకోవాలని కోర్టును అభ్యర్థించింది. ఈ నేపథ్యంలో ఆ కార్గో షిప్ పోర్ట్ నుంచి వెళ్లకుండా నిర్బంధించాలని ఆగస్ట్ 14న ఒడిశా హైకోర్టు ఆదేశించింది. ఈ నిర్బంధాన్ని పర్యవేక్షించడానికి స్థానిక కోర్టు సీనియర్ న్యాయమూర్తిని అడ్మిరల్‌గా నియమించింది. ఈ నేపథ్యంలో కోర్టు తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈజిప్ట్ నౌక అరెస్ట్‌లో ఉంటుందని పోర్ట్ అధికారి తెలిపారు. అయితే గత నాలుగు నెలల్లో పారాదీప్ పోర్టులో మూడు నౌకలు నిర్బంధానికి గురయ్యాయి.



## మొన్న డాక్టర్... నిన్న నర్సు

**న్యూఢిల్లీ :** కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై దేశమంతా భగ్గుమంటుండగానే మరో దారుణం జరిగింది. ఉత్తరాఖండ్‌లో ఓ నర్స్ హత్యాచారానికి గురైంది. జులై 31వ తేదీన అదృశ్యమైన ఆ మహిళ యూపీలో ఓ ఖాళీ ప్రదేశంలో శవమై కనిపించింది. ఆగస్టు 8వ తేదీన ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. జులై 31న బాధితురాలి సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కంప్లెయింట్‌పై విచారణ మొదలు పెట్టిన పోలీసులు యూపీలోని బిలాస్‌పూర్‌లో చెట్ల పొదల్లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అప్పటికే ఆ బాడీ కుళ్లిపోయింది. ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్స్‌గా పని చేస్తున్న బాధితురాలు..చివరి సారి జులై 30వ తేదీన కనిపించింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. బిలాస్‌పూర్‌లో ఓ సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించగా వెంటనే పోలీసుల బృందాలు రంగంలోకి దిగి గాలించాయి. ఆమె మొబైల్ నంబర్‌ని ట్రాక్ చేశారు. ఆ మహిళను ఓ వ్యక్తి వెంబడించినట్టు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డ్ అయింది. విచారణలో భాగంగా పోలీసులు బరేలీ వెళ్లారు. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు అన్ని చోట్లా జల్లెడ పట్టారు. హరియాణా సహా రాజస్థాన్‌లోనూ గాలించారు. నిందితుడు ధర్మేంద్ర రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఉన్నట్టు గుర్తించారు. నిందితుడితో పాటు అతని భార్యనీ అరెస్ట్ చేసి రుద్రపూర్‌కి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇద్దరినీ విచారించారు. తానే అత్యాచారం చేసి చంపినట్టు నిందితుడు అంగీకరించాడు. జులై 30న నర్స్ రోడ్‌పై ఒంటరిగా కనిపించిందని, ఆ సమయంలో చీకటిగా ఉందని చూసి బలవంతం చేసినట్టు చెప్పాడు. పక్కనే ఉన్న పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేసినట్టు ఒప్పుకున్నాడు. అత్యాచారం చేసే క్రమంలో ఆమె ప్రతిఘటించడం వల్ల రాడ్‌తో బలంగా తలపై కొట్టాడు. చున్నీతో ఉరి బిగించి చంపేశాడు. ఆమె డెడ్‌బాడీని అక్కడే పడేసి ఫోన్‌తో పాటు రూ.30 వేల నగదుతో పరారయ్యాడు. కోల్‌కత్తా ఘటనతో ఇప్పటికే దేశమతా అలజడిగా ఉంది. ఆడవాళ్లని ఇలా హింసించి చంపే వాళ్లని వదలకూడదని పలు చోట్ల మహిళలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కోల్‌కత్తాలో అత్యాచారం జరిగిన హాస్పిటల్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగింది. బీజేపీయే ఈ దాడులు చేయించిందని మమతా బెనర్జీ ఆరోపించారు.

## జమ్మూ కశ్మీర్, హర్యానా ఎన్నికల షెడ్యూల్




**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరగనుందని ఈసీ వెల్లడించింది. మొదటి ఫేజ్ ఎన్నికలు సెప్టెంబర్ 18వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఇక రెండో విడత సెప్టెంబర్ 25న, మూడో విడత ఎన్నికలు అక్టోబర్ 1న జరగనున్నాయి. అక్టోబర్ 4వ తేదీన ఫలితాలు విడుదల చేయనున్నట్టు ఈసీ ప్రకటించింది. దాదాపు పదేళ్లుగా జమ్ముకశ్మీర్‌లో ఎన్నికల ప్రక్రియ పెండింగ్‌లోనే ఉంది. ఇన్నాళ్లకు అక్కడ పూర్తిస్థాయిలో ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వం ఏర్పాటు కానుంది. మొత్తం 90 నియోజకవర్గాలున్న జమ్ముకశ్మీర్‌లో 87.09 లక్షల మంది ఓటర్లున్నట్టు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. వీళ్లలో 44.46 లక్షల మంది పురుషులు, 42.62 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఆగస్టు 19వ తేదీన అమర్‌నాథ్ యాత్ర ముగుస్తుందని, ఆగస్టు 20వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రజలు జమ్ముకశ్మీర్‌లో మార్పు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీలోగా జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఈసీ ఎన్నికల తేదీలు ప్రకటించింది. హరియాణా ఎన్నికల తేదీలనూ ఈసీ ప్రకటించింది. అక్టోబర్ 1వ తేదీన ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనుంది. అక్టోబర్ 4న ఫలితాలు విడుదల చేయనుంది. హరియాణా అసెంబ్లీ గడువు నవంబర్ 26వ తేదీతో ముగియనుంది.

## ఆర్జీ కార్ ఆస్పత్రిలో బీజేపీ, సీపీఎం శ్రేణుల అరాచకం




కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన రాజకీయ రంగు పులుముకుంది. మమతా బెనర్జీ సర్కార్ లక్ష్యంగా విపక్షాలు విమర్శలు గుప్పిస్తుంటే కాషాయ నేతలు, కమ్యూనిస్టులపై టీఎంసీ అధినేత్రి విరుచుకుపడుతున్నారు. ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో సీపీఎం, బీజేపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. సీపీఎం, బీజేపీ కార్యకర్తలు అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఆస్పత్రిలోకి ప్రవేశించి అరాచకం సృష్టించారని తనకు తెలుసని చెప్పారు. సీపీఎం కార్యకర్తలు డీవైఎఫ్ఐ జెండాలతో, బీజేపీ కార్యకర్తలు జాతీయ పతాకాలు చేబూని అరాచకానికి తెగబడ్డారని వీడియోలో కనిపిస్తున్నదని అన్నారు. జాతీయ పతాకాన్ని దుర్వినియోగం చేసిన వీరిపై చర్యలు చేపట్టాలని కోరారు. మణిపూర్ భగ్గుమన్నప్పుడు బీజేపీ, సీపీఎంలు ఎన్ని బృందాలను అక్కడికి పంపాయని ఆమె ప్రశ్నించారు. హత్రాస్, ఉన్నావ్‌కు ఎన్ని బృందాలను ఈ పార్టీలు పంపాయని దీదీ నిలదీశారు. మణిపూర్, యూపీల్లో అరాచకాలు జరిగినప్పుడు వీరంతా ఎక్కడ ఉన్నారని ఆమె ప్రశ్నించారు. సీపీఎం, బీజేపీ తనను బెదిరించలేవని, ఎన్నికల్లో ప్రజల మద్దతుతోనే తాము ఇక్కడ వరకూ వచ్చామని ఆమె పేర్కొన్నారు.

## మాది వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్.. ఉద్ధవ్ థాకరే



**ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'మహా వికాస్ అఘాడి' గెలుపు ఖాయమని, తమది వరల్డ్ కప్ విన్నింగ్ టీమ్ అని శివసేన నేత ఉద్ధవ్ థాకరే అన్నారు. ఒక మ్యాచ్ (లోక్‌సభ ఎన్నికలు) ఇప్పటికే గెలిచామని, మరో మ్యాచ్ గెలవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ శుక్రవారంనాడు ప్రకటించే అవకాశాలున్న నేపథ్యంలో ఉద్ధవ్ థాకరే మీడియాతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో కలిసికట్టుగా పోరాడటానికి 'మహా వికాస్ అఘాడి' సిద్ధంగా ఉందని చెప్పారు. కాంగ్రెస్, ఎన్‌సీపీ–ఎస్‌పీలు ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రతిపాదిస్తే వారికి తమ మద్దతు ఉంటుందన్నారు. కలిసికట్టుగా మహారాష్ట్ర అభివృద్ధికి పాటుపడటమే తమ లక్ష్యమని చెప్పారు. బీజేపీతో తమకు పొత్తు ఉన్నప్పుడు ఎక్కువ మంది ఎమ్మెల్యేలున్న పార్టీ నుంచే సీఎంను ఎన్నుకునే వారని, ఆ అనుభవం దృష్ట్యా తాము దీనికి దూరంగా ఉండాలని అనుకుంటున్నామని చెప్పారు. ఎక్కువ మంది ఎమ్మెల్యేలున్న పార్టీకే సీఎం పదవి కట్టబెట్టడానికి తాము సానుకూలం కాదని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన తమ ప్రభుత్వాన్ని గతంలో కూల్చేశారని, తమ పార్టీ పేరు, గుర్తు లూటీ చేశారని ఏక్‌నాథ్ షిండే శివసేనను పరోక్షంగా థాకరే తప్పుపట్టారు. ఈరోజు ఎన్నికలు ప్రకటించినా సమష్టిగా పోరాటం చేసి ఎన్నికల్లో గెలిచితీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు మహారాష్ట్ర ఆత్మగౌరవానికి సంబంధించిన ఎన్నికలుగా అభివర్ణించారు. ఈరోజు ఉన్న బీజేపీ అసలైన బీజేపీ కాదని విమర్శించారు.

ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు?

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీఐ శుక్రవారంనాడు ప్రకటించనుండగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఇప్పుడే ఉండకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది. హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ ఏడాది చివర్లో (నవంబర్‌లో) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.

# రాష్ట్రంలో 24 గంటల పాటు ఓపీ సేవలు బంద్

-మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్టు ఐఎంఏ తెలంగాణ విభాగం ప్రకటించింది. రాష్ట్రప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే.. తెలంగాణ ప్రభుత్వ వైద్యులందరూ శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నారు. పంజగుట్టలోని నిమ్స్‌లో కూడా ఓపీ సేవలతోపాటు కొన్ని రకాల సర్జరీలను నిలిపివేస్తున్నట్టు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. యశోద, రెయిన్‌బో, కిమ్స్-సన్‌షైన్ తదితర ఆస్పత్రులు కూడా ఈ మేరకు ప్రకటన చేశాయి. కాగా.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ ఒక గంట పాటు నిరసన ప్రదర్శన చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ నరహరి పిలుపునిచ్చారు. జూనియర్ డాక్టర్లు ఇప్పటికే సమ్మె చేస్తున్న కారణంగా.. అవసరమైతే ఒక గంట ఎక్కువగా పనిచేసి ఓపీ నిర్వహించాలన్నారు. ఇక.. వైద్యులు, నర్సుల ఆందోళనకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఒక ప్రకటనలో సంఘీభావం తెలిపారు. ఇంతటి దారుణానికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. కేసు దర్యాప్తును సీబీఐ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి ఘటనలు



జరగకుండా డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది భద్రతకు చర్యలు చేపట్టాలని.. వారి మీద దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఓపీ సేవల బంద్ నేపథ్యంలో.. వైద్య సేవలకు అంతరాయం రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా డాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# మహానగరంపై మత్తు మరక

-మొదటిపేజీ తరువాయి

మరోవైపు మత్తు ముఠాలు హద్దులు లేకుండా ప్రవర్తిస్తున్నాయి. ఎంతలా నిఘా పెట్టినా.. ఎన్ని వార్నింగ్‌లు ఇస్తున్నా.. ఎన్ని కేసులు పెడుతున్నా.. చివరాఖరకు చిప్ప కూడు పెడుతున్నా సరే.. కొందరి ప్రవర్తన మారడం లేదు. హైదరాబాద్‌లో వారం రోజులుగా నిత్యం ఎక్కడో ఓ చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉంది. తాజాగా హైదరాబాద్ సైబర్ సిటి పరిధిలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. గచ్చిబౌలిలో ఎస్‌వోటీ పోలీసులు తనిఖీలు చేస్తుండగా డ్రగ్స్ తరలిస్తున్న స్మగ్లర్లు పట్టుబడ్డారని పోలీసలు? తెలిపారు. నిందితుల దగ్గర నుంచి 620 గ్రాముల హెరాయిన్ దొరికిందని పేర్కొన్నారు. పట్టుబడ్డ హెరాయిన్ విలువ మార్కెట్లో రూ. 4.34 కోట్లు ఉంటుందని వివరించారు. ఈమేరకు ఎస్‌వోటీ పోలీసులు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి సమూలంగా నిర్మూలించేందుకు టాస్క్ ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టులతోపాటు ప్రధాన కూడళ్లలోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వాహనాలను, అనుమానితులను ఆపి తనిఖీ చేస్తున్నారు. శుక్రవారంతెల్లవారుజామున ఎస్‌వోటీ పోలీసులు గచ్చిబౌలిలోని టెలికాంనగర్‌లో నిర్వహించిన సోదాల్లో డ్రగ్ స్మగ్లర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రాజస్థాన్ నుంచి హైదరాబాద్ మహానగరానికి డ్రగ్స్ రవాణా చేస్తున్నట్లు పోలీసలు గుర్తించారు. ఇందుకు సంబంధించి ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలుగురు రాజస్థాన్‌కు చెందిన వారని పోలీసులు తెలిపారు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే అత్యాశతో చెడు మార్గాన్ని ఎంచుకుంటున్నారు కేటుగాళ్లు. విషయం తెలిసిన పోలీసులు పక్కా ప్రణాళికతో అక్కడకు చేరుకుని.. డ్రగ్ ఫెడ్లర్‌లకు విక్రయిస్తుండగా ఎనిమిది మందిని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా గంజాయిని విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చెక్ పోస్ట్‌ల దగ్గర తనిఖీలు చేస్తుంటే, రోజూ గంజాయి వాసన కంపు కొడుతోంది.

**రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు రవాణా**

హైదరాబాద్ లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థానీ గ్యాంగును శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. గచ్చిబౌలిలో తనిఖీలు చేస్తుండగా డ్రగ్స్ తరలిస్తున్న స్మగ్లర్లు పట్టుబడ్డారని చెప్పారు. నిందితుల దగ్గర 620 గ్రాముల హెరాయిన్ దొరికిందని పేర్కొన్నారు. పట్టుబడ్డ హెరాయిన్ విలువ మార్కెట్లో రూ.4.34 కోట్లు ఉంటుందని వివరించారు. ఈమేరకు ఎస్‌వోటీ పోలీసులు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి సమూలంగా నిర్మూలించేందుకు టాస్క్ ఫోర్స్, ఎస్ వోటీ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ఎయిర్ పోర్టులతో పాటు ప్రధాన కూడళ్లలోనూ సోదాలు చేస్తున్నారు. వాహనాలను, అనుమానితులను ఆపి తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్‌వోటీ పోలీసులు గచ్చిబౌలిలోని టెలికాంనగర్‌లో నిర్వహించిన సోదాల్లో డ్రగ్ స్మగ్లర్లు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. రాజస్థాన్ నుంచి నగరానికి డ్రగ్స్ రవాణా చేసిన ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలుగురు రాజస్థాన్ కు చెందిన వారని తెలిపారు.

# ఎమ్మెల్సీలుగా ప్రొ కోదండరాం, ఆమీర్ అలీఖాన్ ప్రమాణం

-మొదటిపేజీ తరువాయి

తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రొఫెసర్ కోదండరామ్ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మీడియాతో కాసేపు ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. తాను ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఉద్యమకారుల ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా తాను పనిచేస్తానని కోదండరామ్ తెలిపారు. తెలంగాణ రావడం వలనే తనలాంటి ఉద్యమకారులకు గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. దీన్ని పదవిలా కాకుండా బాధ్యతగా భావించి పనిచేస్తానని చెప్పారు.

**సుప్రీంకోర్టు తీర్పుతో మార్గం సుగమం...**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 జులైలో దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ చేసిన సిఫార్సులను అప్పటి గవర్నర్ తమిళిసై రద్దు చేయడం జరిగింది. దీంతో ఆ స్థానాల్లో ఆ తర్వాత ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరాం, అమిర్ అలీఖాన్‌లను నియమించడాన్ని హైకోర్టు కొట్టివేసింది. దీనిపై సుప్రీంకోర్టు బుధవారం స్టే ఇచ్చింది. కొత్తవారి నియామకాన్ని నిలిపివేయాలన్న పిటిషనర్



విజ్ఞప్తిని తోసిపుచ్చింది. నియామకాలలో కలగజేసుకోలేమని తేల్చిచెప్పింది. దీంతో వీరి ప్రమాణస్వీకారానికి మార్గం సుగమం అయింది. కోదండరాం సార్‌గా సుపరిచితుడైన ముద్దసాని కోదండరాం 1955 సెప్టెంబర్ 5న ముద్దసాని వెంకటమ్మ, ఎం.జనార్దన్ రెడ్డి దంపతులకు జన్మించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నెన్నెల మండలం జోగాపూర్ ఆయన స్వగ్రామం. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీ, ఓయూలో పొలిటికల్ సైన్స్ విభాగంలో పీజీ, జేఎన్‌యూలో ఎంఫిల్ పూర్తి చేశారు. 1981లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉద్యోగం రావడంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్డీ మధ్యలో ఆపేశారు. ఓయూలో సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా పనిచేసిన కోదండరాం.. దివంగత ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సహా అనేక మంది ప్రముఖ తెలంగాణవాదులతోనూ కలిసి పనిచేశారు. ఆదివాసీల హక్కులపై దివంగత నేత బాలగోపాల్, ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావులతో కలిసి ఆయన పని చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ జేఏసీ చైర్మన్‌గా అన్ని పార్టీలను ఏకం చేయడంలో కీలకపాత్ర పోషించారు. క్రియాశీలంగా పని చేశారు.

**జర్నలిజంలో విశేష కృషి చేసిన ఆమీర్ అలీఖాన్**

జర్నలిజంలో విశేష సేవలందించిన ఆమీర్ అలీఖాన్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీసీఏ, తరువాత సుల్తాన్?ఉల్?ఉలూమ్ కాలేజీ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఎంబీఏ చేశారు. ఆయన సియాసత్ ఉర్దూ దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ జాహెద్ అలీఖాన్ కుమారుడు.

ప్రస్తుతం సియాసత్‌లో న్యూస్ ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సియాసత్ పత్రిక ఖతర్ దేశానికి కూడా విస్తరించింది. పలు అంతర్జాతీయ ఈవెంట్లను కవర్ చేయడానికి ప్రధానమంత్రి, రాష్ట్రపతిల వెంట విదేశీ పర్యటనలకు వెళ్లారు. 1973 అక్టోబర్ 18న హైదరాబాద్‌లో జన్మించిన ఆమీర్ అలీ ఖాన్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆయనకు ఉర్దూతో పాటు ఇంగ్లీష్, హిందీ, అరబిక్, తెలుగు భాషలు తెలుసు.


# ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్!

-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కార్యకలాపాల విస్తరణపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. యాపిల్ సంస్థ ఐఫోన్లకు సంబంధించిన ఎయిర్‌పాడ్స్, ఇతర యాక్సరీసను ఫాక్స్‌కాన్ సంస్థ తయారు చేస్తుంటుంది. గత ఏడాది హైదరాబాద్‌లో ప్లాంటు ఏర్పాటుకు ఈ సంస్థ ముందుకురాగా.. ప్రభుత్వం నగర శివార్లలోని కొంగరకలాన్ వద్ద 120 ఎకరాల భూమిని కేటాయించింది. అందులో 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఇది అందుబాటులోకి వస్తే.. యాపిల్ సంస్థకు అవసరమైన ఎయిర్‌పాడ్స్, ఇతర యాక్సరీసను తయారు చేయడాన్ని మొదలుపెడతారు. ఈ సంస్థ భవనాన్ని కూడా సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో ప్రారంభించే అవకాశాలున్నాయి. దీనికి విస్తరణగా.. ముచ్చర్లలోని ఫోర్త్ సిటీలో మరో ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో ఫాక్స్‌కాన్ ఉన్నట్లు తెలిసింది. ఇదే విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో ఆ సంస్థ చైర్మన్ యంగ్ లియూ చర్చించారని సమాచారం. ఫోర్త్ సిటీలో తమకు 500 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాలని ఆయన అడిగినట్లు తెలిసింది. అందులో 64 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనాలను నిర్మిస్తామని చెప్పినట్లు సమాచారం.

**మీ దార్శనికత అద్భుతం..**

తెలంగాణలో ఫోర్త్ సిటీ రూపకల్పన తీరు, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలు ఆకట్టుకునేలా ఉన్నాయని



ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి విజన్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో విస్తరించే సత్తా ఉందని, త్వరలోనే తన బృందంతో కలిసి నగరాన్ని సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సంస్థ భారతదేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌కు వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ చరిత్ర, పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను ఫాక్స్‌కాన్ బృందానికి ముఖ్యమంత్రి వివరించారు. 430 ఏళ్ల క్రితం పునాదిరాయి పడిన హైదరాబాద్.. కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును తెలియజేశారు. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఇందులో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను, వైస్ చైర్మన్‌గా మరో పారిశ్రామికవేత్త శ్రీనివాస రాజును నియమించామని తెలిపారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని అనుమతులు, మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## అతి త్వరలో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం తథ్యం...

-మొదటిపేజీ తరువాయి




వస్తుందనడం మూర్ఖత్వం, ఆప్ పార్టీని విలీనం చేసుకుంటేనే సిసోడియాకు బెయిల్ వచ్చిందా? బాధ్యతాయుత పదవుల్లో ఉంటూ న్యాయస్థానాలపై బురదచల్లుతురా? కవిత బెయిల్ పై కావాలనే బీజేపీపై కాంగ్రెస్ దుష్ప్రచారం, కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్, కేటీఆర్ లను ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తానన్నట్లుంది కాంగ్రెస్ బీఆర్ఎస్ తీరు బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని, అందులో భాగంగానే కవితకు బెయిల్ రాబోతుందంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. కవితకు బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనేది న్యాయ స్థానం పరిధిలోని అంశం. కవిత బెయిల్ కు, బీజేపీకి ఏం సంబంధం? ఆప్ పార్టీని వలీనం చేసుకుంటేనే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు బెయిల్ వచ్చిందా? ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ రాజకీయ లబ్ది కోసం న్యాయస్థానంపై బురద చల్లి కోర్టుల ప్రతిష్టను తగ్గించడం దుర్మార్గం. బీజేపీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారు.

బీఆర్ఎస్ పార్టీది ముగిసిన అధ్యాయం. ప్రజలు ఛీత్కరించిన ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదు. బీఆర్ఎస్ ను విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ తహతహలాడుతోంది. పథకం ప్రకారమే ఆ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లో చేర్చుకుంటున్నారు. అతి త్వరలోనే కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనమవడం తథ్యం. కేసీఆర్ ను ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ ను పీసీసీ చీఫ్, హరీష్ రావుకు మంత్రి, కవితకు రాజ్యసభ పదవులు ఖాయం. అంత ఉబలాటముంటే రాజ్యసభ ఎన్నికలొస్తున్నందున కవితను కాంగ్రెస్ పక్షాన రాజ్యసభకు పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

గతంలోనూ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోవడంతోపాటు మంత్రి పదవులు పంచుకున్న చరిత్ర కాంగ్రెస్ కు ఉంది. అందుకే కాళేశ్వరం, డ్రగ్స్ ఫోన్ ట్యాపింగ్ సహా అనేక అవినీతి అక్రమాలు, అరాచకాలకు పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలు జైలుకు వెళ్లకుండా కాపాడుతున్నది కాంగ్రెస్ పార్టీయే. బీఆర్ఎస్ తో కాంగ్రెస్ దాగుడు మూతల వ్యవహారం జగమెరిగిన సత్యం. నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తానన్నట్లుంది కాంగ్రెస్ బీఆర్ఎస్ నేతల తీరు. సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కాళేశ్వరం సహా అనేక అంశాల్లో వేల కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్ లను జైలుకు పంపాలి. కేసీఆర్ కుటుంబ ఆస్తులను జప్తు చేయాలి లేనిపక్షంలో దాగుడుమూతలాడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం పక్కా

-మొదటిపేజీ తరువాయి

గవర్నర్‌గా పంపిస్తారని రేవంత్ చెప్పుకొచ్చారు. లిక్కర్ స్కామ్ కేసులో జైలులో ఉన్న కవిత అప్పుడు బెయిల్ వస్తుందని తెలిపారు. కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి వస్తుందని, తెలంగాణలో హరీష్‌రావు ప్రతిపక్ష నేతగా ఉంటారని అన్నారు. ఉన్న నలుగురు రాజ్యసభల ఎంపీలు కూడా బీజేపీలో చేరిపోతారని అన్నారు. అనంతరం కవితకు బెయిల్ వస్తుందని ఆమెను కూడా రాజ్యసభకు పంపిస్తారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ విలీనం వార్తలు ఎప్పటి నుంచో వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో దీనిపై తెగ చర్చించుకుంటున్నారు. అందుకే పది రోజుల క్రితం ఇలాంటి వాటిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. మొదటి నుంచి తెలంగాణ కోసం, ప్రజల కోసం కొట్లాడిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే నని అన్నారు. భవిష్యత్‌లో కూడా బీఆర్ఎస్ అలానే కొట్లాడుతుందన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని? చెప్పుకొచ్చారు. దీనిపై తప్పుడు ప్రచారాలు చేస్తే మాత్రం సీరియస్ యాక్షన్ తీసుకుంటాని హెచ్చారించారు. కేటీఆర్ ఇచ్చిన క్లారిటీతో విలీనం చర్చకు ఫుల్‌స్టాఫ్ పడింది. అయితే ఇప్పుడు మరోసారి రేవంత్ రెడ్డి బిగ్ స్టేట్మెంట్ ఇవ్వడంతో మరోసారి చర్చకు తెరలేచింది. ఇంత వరకు చిన్నాచితకా నేతలో ఇతర వ్యక్తులో కామెంట్స్ చేస్తూ వచ్చారు.అయితే ఇప్పుడు ఏకంగా సీఎం స్థాయి వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో మళ్లీ చర్చ మొదలైంది. దీనిపై బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుందో చూడాలి

## రేవంత్ రెడ్డి అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడు..

-మొదటిపేజీ తరువాయి

పెట్టి మరీ.. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని కేటీఆర్ ఎండగట్టారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించిన కేటీఆర్.. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని అలా నేను కూడా స్టోరీలు చెప్పగలనని అన్నారు. ' రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడు. మనోడు అమెరికా అధ్యక్షుడు అయితడని.. మొన్ననే కేజీఎఫ్‌లో ఏదో మీటింగ్ పెట్టి ఆయనెవరో చెప్పారు కదా.. ఈయనే అయితడేమో మరి' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ట్రంప్ సరిపోతలేదని.. రేవంత్‌ను పిలుస్తున్నారేమో అని వెటకారంగా అన్నారు.

**మాకు రాజీనామాలు కొత్త కాదు.. రేవంత్ రెడ్డికి మోసాలు కొత్త కాదు**

మాకు రాజీనామాలు కొత్త కాదు.. రేవంత్ రెడ్డికి మోసాలు కొత్త కాదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి మాట తప్పిన సన్నాసి ఎవరని ప్రశ్నించారు.

**రేవంత్ రెడ్డికి ఆ సంస్కారం ఉందా?**

మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కూడా కేటీఆర్ స్పందించారు. మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. యథాలాపంగా మాట్లాడుతూ ఒక్క మాట అన్నానని.. అందుకే క్షమించాలని సోదరీమణులను అడిగానని చెప్పారు. తాను ముందుకొచ్చి ఆ మాట మాట్లాడానని తెలిపారు. సబితక్క, సునీతక్క, కోవా లక్ష్మక్క గురించి పనికిమాలిన మాటలు మాట్లాడినందుకు క్షమాపణలు చెప్పే ఇంగితం గానీ, సంస్కారం గానీ ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. సంస్కారం ఉంటే క్షమాపణ చెప్పాలని కోరారు.

**దమ్ముంటే కొడంగల్‌కు రా.. రుణమాఫీపై చర్చ పెడదాం..**
**రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాలు**

సంపూర్ రుణమాఫీ జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. వంద శాతం రుణమాఫీ ఎక్కడ జరిగిందని కాంగ్రెస్ నాయకులను ఆయన ప్రశ్నించారు. రుణమాఫీపై మీరు చెప్పిన మాటల్లో నిజం ఒక్క శాతం నిజం ఉన్నా సరే.. సెక్యూరిటీ లేకుండా నీ కొడంగల్ నియోజకవర్గానికి రావాలని సవాలు విసిరారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఏ గ్రామంలో అయినా సరే వంద శాతం రుణమాఫీ జరిగిందని చెబితే అక్కడికక్కడే రాజీనామా చేస్తానని అన్నారు. రాజకీయాలు వదిలేసి.. ఇంట్లోనే కూర్చుంటానని స్పష్టం చేశారు. రుణమాఫీ జరిగిందని నువ్వు చెప్పింది నిజమైతే కొడంగల్‌లో ఏ ఒక్క గ్రామంలో అయినా చర్చ పెడదామని కేటీఆర్ సవాలు విసిరారు. కొడంగల్‌లో మాత్రమే కాదని.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో చాలా ఊర్లు తిరిగి.. ఈ పచ్చి మోసాన్ని ఎండగడతామని స్పష్టం చేశారు. దమ్ముంటే ముఖ్యమంత్రి తన సవాలును స్వీకరించాలని అన్నారు. కొడంగల్‌లో కాకుంటే ఉమ్మడి పాలమూరులోని ఏ నియోజకవర్గంలో అయినా చర్చకు రెడీనా అని తెలిపారు. నీ సొంతూరు కొండారెడ్డిపాలెంలో అయినా సరే వంద శాతం రుణమాఫీ జరిగిందని రుజువు చేయాలని సవాలు విసిరారు.

**సీఎం మీద చీటింగ్ కేసు పెట్టాలి**


సగం కూడా రుణమాఫీ చేయకుండా వంద శాతం చేశామని చెప్పుకోవడం సంపూర్ణంగా దిగజారడమే అని కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ కాలేదని చాలామంది రైతులు ఆందోళనలో ఉంటే.. సంబరాలు చేసుకుంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండి పడ్డారు. రైతు రుణమాఫీ పచ్చి మోసం, దగా అని పునరుద్ఘాటించారు. రైతులను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి మీద చీటింగ్ కేసు పెట్టాలని రైతులకు పిలుపునిచ్చారు.

**ఫ్రస్టేషన్‌లో రంకెలు వేస్తున్నారు**

సీఎం రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో రంకెలు వేస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొండల్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన విజయవంతమైనట్లు ఉంది.. అదే రేవంత్ అమెరికా టూర్ ఆ స్థాయిలో వర్కవుట్ అయినట్టు లేదు.. దీంతో ఫ్రస్టేషన్ పెరిగిపోయిందని అన్నారు.

# రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించట్లేదు

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాలెంజ్‌కు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పందించి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మీడియాతో మాట్లాడిన హరీష్.. సీఎంపై ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించట్లేదనే విషయాన్ని ప్రతి సందర్భంలోనూ నిరూపించుకుంటున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గానీ.. తెలంగాణ చరిత్రలో గానీ ఇంత దిగజారిన, దిక్కుమాలిన ముఖ్యమంత్రి ఇంకెవరూ లేరని కౌంటర్ ఇచ్చారు హరీష్. అబద్ధం కూడా సిగ్గుపడి మూసిలో దూకి ఆత్మహత్య చేసుకునేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన ఉంది. దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకొని కూడా మాట మీద నిలబడలేదు. నిస్సిగ్గుగా బీఆర్ఎస్ మీద.. నామీద అవాకులు చెవాకులు పేలారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియా గాంధీ పుట్టిన రోజు కానుకగా డిసెంబర్-9 నాటికి 40వేల కోట్ల రూపాయల రైతు రుణ మాఫీ ఏకకాలంలో చేస్తాన్నన్నది రేవంత్ రెడ్డే కదా, అనే విషయాన్ని హరీష్ గుర్తు చేశారు.



**లెక్కలు తీసి మరీ..!**

'డిసెంబర్-9న రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికల ముందు మరో నాటకానికి తెరలేపిండు. ఆగస్టు-15తేదీ వరకూ 31వేల కోట్లు మాఫీ చేస్తానని ఎన్నికలలో ఊదరగొట్టిండు. 9వేల కోట్లు కోత పెట్టిండు. అయినా ఎవరూ నమ్మడం లేదని ప్రతి ఊరి దేవుడి మీద ప్రమాణాలు చేసిండు. సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే నా లక్షణం. మోసమే నా విధానం. మాట తప్పడమే నా నైజం అనే విధంగా నగ్నంగా తన నిజస్వరూపాన్ని ఈ రోజు బట్టబయలు చేసుకున్నడు. మేము మొదటి దఫాలో లక్ష రూపాయల రుణమాఫీ 35లక్షల మంది రైతులకు చేస్తేనే దాదాపు 17వేల కోట్లు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రెండు లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటరా..? రూ. 17,869 కోట్లు మాత్రమే అవుతాయా?. ఈ ఒక్క విషయంతోనే మీ రుణమాఫీ పచ్చి అబద్ధం అని తేలిపోతున్నది. మీరు దగా చేశారనన్నది స్పష్టంగా తేలిపోయిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలి?. ఏటిలో దుంకి ఎవరు చావాలి?' అని రివర్స్ అటాక్ చేశారు హరీష్.

**హరీష్ ఆందోళన ఇదీ**

నోటికి వచ్చినట్లు దిగజారుడు భాషలో బీఆర్ఎస్‌ను తిడితేనో, తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో రంకెలు వేస్తేనో అబద్ధాలు నిజాలు అయిపోవు. రేవంత్ రెడ్డి నువ్వు రైతు ద్రోహానికి మాత్రమే కాదు. దైవ ద్రోహానికి పాల్పడ్డావు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి దేవుళ్ల మీద ఒట్టుపెట్టి.. మాట తప్పి నువ్వు చేసిన అపచారానికి వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. కానీ నీకు ఆ సంస్కారం లేదు. నీలో ఉన్నది వికారమే తప్ప, సంస్కారం కాదు. ముఖ్యమంత్రి స్థాయిలో నువ్వు మాట తప్పినందుకు ఆ దేవుళ్లు తెలంగాణ మీద ఎక్కడ ఆగ్రహిస్తారో, నువ్వు చేసిన పాప ఫలితం ప్రజలకు ఎక్కడ శాపంగా మారుతుందో అని నేను ఆందోళనకు గురవుతున్నాను. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేసిన తప్పుకు గాను, దైవ ద్రోహానికి గాను తెలంగాణ మీద ఆగ్రహించవద్దని ముక్కోటి దేవుళ్లకు మొక్కుతున్నా. ఆయన ఏ దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మాట తప్పిండో ఆ దేవుళ్లందరి దగ్గరికి త్వరలో నేనే స్వయంగా పోతా. రేవంత్ రెడ్డి చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారొద్దని ఆ దేవుళ్లను ప్రార్థించి వస్తాను' అని హరీష్ చెప్పుకొచ్చారు.

**రేవంత్ ఛాలెంజ్ ఇదీ**

హరీష్ రావుకు మరోసారి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని.. చీము, నెత్తురు ఉంటే హరీష్ రాజీనామా ఖమ్మం జిల్లా వైరా బహిరంగసభలో ఛాలెంజ్ చేశారు. రాజీనామా చేస్తే సరే.. లేకుంటే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. 'హరీష్‌రావు రాజీనామా చెయ్యి.. మళ్లీ ఎలా గెలుస్తావో చూస్తా. సిద్దిపేటలో హరీష్‌ను ఓడించే బాధ్యత నాది. బీఆర్ఎస్ పార్టీ బతుకు బస్టాండ్ అయ్యింది. బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలుపుతాం' అని ఈ సభావేదికగా రేవంత్ మరో ఛాలెంజ్ చేశారు. ఈ కామెంట్స్‌పై హరీష్ స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు..

# మహిళలకు కేటీఆర్ సారీ

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** మహిళలకు ఫ్రీ బస్సు పథకంపై.. కస్సుబుస్సు అంటున్నాయి అధికార విపక్షాలు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన కామెంట్లకు అంతకంటే ఘాటుగా కౌంటర్ ఇచ్చారు మంత్రి సీతక్క. ఇక కేటీఆర్ వ్యాఖ్యలపై విచారణకు ఆదేశించింది మహిళా కమిషన్. ఈ నేపథ్యంలోనే ఒక అడుగు వెనక్కి వేసిన కేటీఆర్, మహిళలకు క్షమాపణలు చెప్పారు. పంద్రాగస్ట్ సందర్భంగా పార్టీ సమావేశంలో చేసిన వ్యాఖ్యలవల్ల, మహిళలకు మనస్తాపం కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నా అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. అక్కచెల్లెమ్మలకు కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదని, వారిని మనస్సు నొచ్చుకుంటే సారీ అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు."గురువారం పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే, నేను విచారం వ్యక్తం చేస్తున్నాను. నా అక్కచెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు" అని కేటీఆర్ ఎక్స్‌లో ట్వీట్ ద్వారా క్లారిటీ



ఇచ్చారు.నిన్న పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే, నేను విచారం వ్యక్తం చేస్తున్నాను

అయితే అంతకుముందు మహిళలకు ఉచిత బస్సు పథకంపై తెలంగాణలో మాటల యుద్ధం నడుస్తోంది. ఉచిత బస్సు ప్రయాణంపై అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్‌ల మధ్య రగడ రాజుకుంది. మహిళలు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు, వాళ్ల పని వాళ్లు చేసుకుంటే తప్పేంటి అంటూ అసెంబ్లీలో మంత్రి సీతక్క చేసిన కామెంట్లపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. బస్సులో అల్లం వెల్లుల్లి ఏరితే తప్పని తాము అనలేదంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు. మనిషికో బస్సు పెట్టండి, బ్రేక్ డ్యాన్సులు చేసుకోండంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.మహిళలను బ్రేక్ డ్యాన్సులు చేసుకోమంటారా అంటూ కేటీఆర్‌పై మంత్రి సీతక్క మండిపడ్డారు. లాంగ్ జర్నీలో ఖాళీగా ఉండలేక, పనులు చేసుకుంటే తప్పేంటి అని ప్రశ్నించారు సీతక్క. మీ ఇళ్లల్లో ఆడపడుచులు లేరా అంటూ కేటీఆర్‌పై మంత్రి ఫైర్ అయ్యారు. బైట్: సీతక్క, తెలంగాణ మంత్రి. మాటల మంటలు రేపిన ఈ డైలాగ్ వార్‌పై సీరియస్ అయిన మహిళా కమిషన్.. ఖుఫీ వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి, విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ మహిళలకు క్షమాపణలు చెప్పారు.

## గ్రేటర్‌లో భారీ వానలు



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో వాన దంచికొట్టింది. ఏక ధాటిగా మూడు గంటల పాటు వర్షం కురిసింది. భారీ వర్షానికి భాగ్యనగరం అతలాకుతలమైంది. వానకు తోడుగా బలమైన ఈదురుగాలులు కూడా వీచాయి. ఒక్కసారిగా వర్షం విరుచుకు పడటంతో పలు చోట్ల రోడ్లన్నీ నీటితో మునిగిపోయాయి. మోకాళ్ల లోతు వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనాలు నానా అవస్థలు పడ్డారు. దీంతో పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రయాణికులు ఎక్కడికక్కడ రోడ్లపై చిక్కుకుపోయారు.బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో హైదరాబాద్ నగరంలో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. గడచిన మూడు, నాలుగు రోజులుగా ఉక్కపోతతో నగరవాసులు ఉక్కిరి బిక్కిరవుతున్న క్రమంలో వర్షం కాస్త ఉపశమనం కలిగినట్లైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం రాత్రి 9 గంటల వరకు సికింద్రాబాద్‌లోని పాటిగడ్డలో అత్యధికంగా 74.8 మి.మీ, బన్సీలాల్‌పేట్‌లో 73.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) అధికారులు వెల్లడించారు. ముషీరాబాద్‌లో 73 మి.మీ., రామచంద్రాపురంలో 68.5 మి.మీ., కూకట్‌పల్లిలో 64.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. ఇక జిల్లాల విషయానికొస్తే సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 93.5 మిల్లీమీటర్ల, నాగర్‌కర్నూల్ జిల్లాలో 87 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.ఆవర్తనం కొనసాగుతుండటం వల్ల రాగల మరో రెండు రోజులు హైదరాబాద్‌లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగస్టు 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారులు హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే 040-21111111 లేదా 9000113667 నంబర్లను ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు

### జర్నలిస్టుల దీక్షలు 14వ రోజు

# ఇళ్ల స్థలాలు సాధించే వరకు దీక్ష విరమింప చేసేదిలేదు



**జగిత్యాల, శుభ తెలంగాణ :** ఇళ్ల స్థలాల సాధన కోసం జగిత్యాల జర్నలిస్టులు చేపట్టిన నిరసన దీక్ష 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. జర్నలిస్టుల న్యాయమైన కోరికలు ప్రభుత్వం వెంటనే తీర్చాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తాము మద్దతు ఇస్తామని ప్రకటించారు. జగిత్యాల రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు దీక్షా చేపట్టిన జర్నలిస్టులకు తమ సంఘీభావం తెలుపుతూ 14వ రోజు దీక్షలను నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రజా సేవ కోసమే పనిచేస్తున్న జర్నలిస్టుల న్యాయమైన కోరికను తీర్చే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు జమాల్, తిరుపతి, శేఖర్, అబ్దుల్ సలాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.ఈ దీక్షలో జగిత్యాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా కేంద్రంలో పిఎన్ఆర్ టౌన్ షిప్‌లో చోరీ

**వెనుక గోడకు రంధ్రం పెట్టి లోనికి చేరబడిన దొంగలు...**

**తాళాలు వేసిననాలుగు ఇళ్లలో చోరీ 12 తులాల బంగారం వెండి 40,000 నగదు అపహరణం..**

**పట్టించుకోని పోలీసులు. ఆందోళన లో కాలనీ వాసులు**

పిఎన్ఆర్ టౌన్ షిప్ లో మళ్లీ దొంగలు హల్చల్ చేసారు. తాళాలు వేసిన నాలుగు ఇళ్లలో బుధవారం రాత్రి చోరీ చేసి 12 కులాల బంగారం 40,000 నగదు కొంత వెండి ని దొంగిలిచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు 50 రోజులని మూడుసార్లు దొంగతనాలు జరగడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు కత్తులు ఇనుపరాలతో ముసుగులు వేసుకొని హల్చర్ చేస్తున్నారు.మండల పరిధిలోని కుడ కుడ శివారు జూనితీ టౌన్ షిప్ లో గత 50 రోజుల్లో 3 సార్లు దొంగతనాలు జరగడం తో కాలని వాసులు భయాందోళన చెందుతున్నారు. కాలనీ లోని 6వ వీది లో నగేష్, ఇంట్లో 12తులాల బంగారం నూనె సత్యనారాయణ ఇంట్లో 40వేలు నగదు, సిల్వర్. బాలస్వామి నీలమ్మ ఇళ్లలో చోరీ చేశారు. గత 50 రోజుల్లో 3 సార్లు గుర్తు తెలియని వ్యక్తులు టౌన్షి ప్ లో 7 ఇళ్లలో చోరీ కి దిగి బంగారం వెండి తో పాటు నగదు దొంగలించారు. ముందు గేటు వైపు వాచ్మెన్ ఉండడంతో వెనుక గోడకు రంధ్రం పెట్టి లోనికి చూడబడ్డారు. ప్రతి వీధికి సీసీ కెమెరాలున్నప్పటికీ ముసుగులతో వచ్చి రాత్రి వేళలు తాళాలు వేసిన ఇళ్ళ ను టార్గెట్ గా పనిచేసుకొని దొంగతనాలకు పాల్పడ్డట్లు కాలని వాసులు తెలిపారు. పోలీసులు విచారణ చేపటినప్పటికీ ఎలాంటి ఆచూకీ తెలియకపోవడంతో కాలని వాసులు అందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళలో దొంగలు సీసీ కెమెరాలకు దొరకకుండా మూసుకులతో చెట్లపొదలు చాటుగా వచ్చి ఇళ్ళ లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. దాంతో గత నెల రోజులు క్రితం కాలని లో ఇండ్ల ముందు ఏళ్ల తరబడి పెంచుకున్న పచ్చని పూల పండ్ల మొక్కలు నిర్దాక్షిణ్యనీగా నరికి వేసుకుంటున్నారు. ప్రతి ఇంటిలో ఉన్న మొక్కలు, వీధుల్లో ఉన్న మొక్కలు దొంగల భయానికి నరికి వేస్తున్నారు. వరుస దొంగ తనాలు జరిగి కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నప్పటికి పోలీసులు కనీసం పెట్రోలింగ్ కు రాకపోవడం విశేషం . మరో విషయం ఏమిటంటే ఇదే కాలనీలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, ముగ్గురు ఎస్సైలు మరికొందరు పోలిసు శాఖ లతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు ఈకాలని లో నివాసం ఉంటున్నారు.

## పోషణ ఆరోగ్య జాతరపై సమీక్ష.. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, శుభ తెలంగాణ :** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలో త్వరలో నిర్వహించనున్న పోషణ ఆరోగ్య జాతర పై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యునిసెఫ్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ, ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, మెప్మా ఐకెపి శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత, నాటిక వంటి కార్యక్రమాలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, యునిసెఫ్ అధికారులు డాక్టర్ క్యాతీ తివారి, బి.వి.సుబ్బారెడ్డి, అడిషనల్ డిఆర్‌డిఓ సునిత, డిఎంహెచ్.ఓ సుజాత, మెడికల్ ఆఫీసర్ సౌమ్య, పంచాయతీ రాజ్ ఏఓ ఫరీదుద్దీన్, ఎంపీడీవో, ఎంపీఓ, సిడిపిఓలు, పోషణ్ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

**మానకొండూరులో పాఠశాల పరిశీలన:**

పోషణ ఆరోగ్య జాతర నిర్వహణకు గాను మానకొండూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పత్తి పరిశీలించారు. ఇదే పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్ర సొంత భవనాన్ని కూడా పరిశీలించారు. ఆరోగ్య పోషణ జాతర నిర్వహణకు ఉన్న సౌకర్యాలను గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోషణ జాతరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, మానకొండూర్ తహసిల్దార్ రాజేశ్వరి ఉన్నారు.

## నాంపల్లి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ముందు ఆందోళన

**హైదరాబాద్ :** నాంపల్లిలో ఇంటర్ బోర్డ్ కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గెస్ట్ లెక్చరర్స్ భారీగా చేరుకున్నారు. గెస్టు లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ... ఛలో ఇంటర్ బోర్డు కార్యాలయ ముట్టడికి ప్రభుత్వ అతిథి అధ్యాపకులు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అతిథి అధ్యాపక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు రాష్ట్ర వ్యాప్తంగా తరలి వచ్చారు అధ్యాపకులు. పోలీసులు భారీగా మోహరించారు. తక్షణమే ఈ విద్యాసంవత్సరం కొనసాగింపు రెన్యూవల్ జీవో ఇవ్వాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం టీజీపీఎస్సీ ప్రకారం జేఎల్ నోటిఫికేషన్ తో సంబంధం లేకుండా... 42వేల వేతనంతో 12నెలలు కొనసాగింపు తక్షణమే అమలు చేయాలి. మహిళ ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలి. 1654 మంది గెస్ట్ లెక్చరర్ల కు భద్రతకల్పించి,కంటిన్యూగా కొనసాగించాలి. గత 10సంవత్సరాలుగా నిరంతరం విద్యార్థులకు విద్య అందిస్తూ..విద్యావ్యవస్థలో అనేక మార్పులు తెచ్చామని అన్నారు.

## జలమండలి ఎండి పర్యటన

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** హైదరాబాద్ రామంతపూర్ నుండి ఉప్పల్ వరకు ఏడు కిలోమీటర్ల మేర జలమండలి ఎండి అశోక్ రెడ్డి పర్యటించారు. ఎండి మాట్లాడుతూ సంవత్సరాలుగా పెండింగ్ లో ఉంటున్న సివరేజ్ నెట్వర్క్ మేజర్ సమస్య. 50 ఏళ్లు 100 ఏళ్ళు నాటి పైప్ లైన్స్ కారణంగా సమస్యలున్నాయి. ఉప్పల్, రామంతపూర్ లో సుమారు 15, 20 సంవత్సరాల క్రితం పైపులైన్లు. ప్రతిరోజు సమస్య కి ప్రియారిటి ఇస్తూనే .. నిధులతో ఆ సమస్య రాకుండా ఏం చేయాలి లాంగ్ టర్మ్ లో శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తున్నాం. ఎస్టిపి రెడీగా ఉంది లైన్ బ్లాక్ అవుతుంది త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు.

## గ్రేటర్‌లో మునిసిపల్ ప్రన్సిపల్ సెక్రటరి ఆకస్మిక తనిఖీలు

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** గ్రేటర్ హైదరాబాద్ లో పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆకస్మిక తనిఖీలుచేసారు. క్షేత్ర స్థాయిలో తరచూ చెత్త వేసే ప్రాంతాలను (జీవీపీ) పరిశీలించారు. జోనల్ కమిషనర్ లతో కలిసి జూబ్లీ హిల్స్ రోడ్ నం.45, రోడ్ నం.70, గౌతం నగర్ బస్తీ, దీన్ దయాళ్ నగర బస్తీ, ఫిల్మ్ నగర్, పీఈటీ పార్క్ ప్రాంతాల్లో పర్యటించారు. ఎస్ఎఫ్ఏ ం, పారిశుధ్య కార్మికులతో ఇంటరాక్షన్ అయ్యారు. చెత్త ఎక్కువ ఉంటే ప్రాంతాల్లో రెండు షిఫ్టుల్లో చెత్త సేకరణకు ఆదేశించారు. వరద నీళ్లు నిలిచే ప్రాంతాల్లో ప్రభుత్వ నిర్మిస్తున్న సంపుల నిర్మాణ పనుల పరిశీలించారు.

## అధికార లాంఛనాలతో డా. ఆర్.ఎన్.అగర్వాల్ అంత్యక్రియలు

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** ఆగస్టు 15 వ తేదీన కాలధర్మం చెందిన భారత రక్షణ వ్యూహాత్మక అగ్ని మిస్సైల్ రూపకర్త, భారత మిస్సైల్ కార్యక్రమ దిగ్గజం డా. రామ్ నారాయణ్ అగర్వాల్ అంత్య క్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ లో ఆగస్టు 17 వ తేదీ శనివారం నాడు వీరి అంత్యక్రియలు జరుగనున్నాయి. రక్షణ రంగంలో డా. అగర్వాల్ చేసిన సేవలకు గుర్తింపుగా 1990 లో పద్మశ్రీ, 2000 లో పద్మ భూషణ్ అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 1983 లో భారత ప్రభుత్వం ప్రారంభించిన అత్యంత ప్రతిష్టాత్మక భారత మిస్సైల్ కార్యక్రమంలో డా. అరుణాచలం, డా. ఏ.పీ.జె. అబ్దుల్ కలాం లతో కలసి డా. ఆర్.ఎం. అగర్వాల్ పనిచేశారు. హైదరాబాద్ లో అడ్వాంసుడ్ సిస్టమ్స్ లాబరేటరీ (యాఒ )వ్యవస్థాపక డైరెక్టర్ గా అగర్వాల్ పనిచేసారు. 2005 లో డిఫెన్స్ రీసర్చ్, డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (ఆఖీఆూ ) లో విశిష్ట శాస్త్ర వేత్తగా పదవీ విరమణ చేసిన డా. రామ్ నారాయణ్ అగర్వాల్ హైదరాబాద్ లో నివాసం ఏర్పరచుకొని చివరి వరకు రక్షణ రంగానికి సేవలందించారు. భారత లాంగ్ రేంజ్ మిస్సైల్ టెక్నాలజీ రంగంలో దేశం స్వయం ప్రతిపత్తి సాధించడంలో విశేష సేవలందించిన డా. రామ్ నారాయణ్ అగర్వాల్ అంత్య క్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ ఇవబతినిటతి..

## హరీష్‌రావ్ కాంగ్రెస్ పార్టీకి బేషరత్‌గా క్షమాపణలు చెప్పాలి

**దేవరకొండ , శుభ తెలంగాణ:** దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి కి బియర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావ్ గాన్ పార్క్ దగ్గర అమరవీరుల స్తూపం దగ్గర ముక్కు నెలకి రాసి బేషరత్ గా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.నిజమైన రైతులకు రైతు భరోసా పతకం ద్వారా పంటకు 7500చొప్పున రెండు పంటలకు 15000వేల రూపాయలు త్వరలో ఇవ్వబోతున్నామని తెలిపారు. నిజమైన కౌలుదారినికి సంవత్సరానికి 12000 రూపాయలు ఇవ్వబోతున్నాని తెలియజేశారు

## కరాటే గోల్డ్ మేడలిస్ట్ వినిల్ కుమార్‌ను సన్మానించిన డివై జేపీసీ చైర్మన్, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్.....



**(దేవరకొండ/శుభ తెలంగాణ/16ఆగస్టు)** దేవరకొండ నియోజకవర్గం 38వ షోతకన్ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2024లో నేషనల్ లెవెల్ లో గోల్డ్ మెడల్ సాధించిన కొట్టేపాక వినీల్ కుమార్ నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం లోని నేరేడుగోమ్ము మండలంలోని పెద్ద మునిగల్ కొట్టేపాక మురళీకృష్ణ జ్యోతిల కుమారుడు గతంలో కూడా గ్రామస్థాయి నుండి జాతీయస్థాయిలో కరాటలో అత్యున్నత నైపుణ్యం కనపరచి గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా వారికీ శుక్రవారం కలిసి శాలవతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.భవిష్యత్ లో మరెన్నో గొప్ప పతకాలు సాధించి దేశానికి,రాష్టానికి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు శ్రీరాములు,జగదీశ్,మధు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధిగా తాడూరి గగన్ కుమార్.....




**(అల్వాల్/శుభ తెలంగాణ ప్రతినిధి వెంటేష్)** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యమకారుల ఆత్మగౌరవం,సంక్షేమ బోర్డు ఏర్పాటుకై గత ఆరు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న ఏకైక ఫోరం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేడు హైదరాబాద్ అల్వాల్ లోని టీయుఎఫ్ టీవీ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది.ఇట్టి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి పటోల్ల సురేందర్ రెడ్డి ప్రతిపాదన మేరకు రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్ష బాధ్యతలు 2018 నుండి నేటి వరకు నిర్వహిస్తు అన్ని కార్యక్రమాలలో తన వంతు కార్యక్రమ విజయవంతానికి కృషి చేస్తు ఉద్యమకారుల గళం వినిపిస్తున్న తాడూరి గగన్ కుమార్ కు అదనపు బాధ్యతలుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధిగా నియమించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంద్ర కుమార్,టీయుఎఫ్ ఛానల్ ప్రతినిధి భాస్కర్,రాష్ట్ర కార్యదర్శి జానకి రెడ్డి,సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాంబాబు ముదిరాజ్,మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దోమాటి కిరణ్ కుమార్,జిహెచ్ఎంసి కో-ఆర్డినేటర్ లక్ష్మణరావు,జాయింట్ కన్వీనర్ జగన్ యాదవ్,1969 ఉద్యమకారుల కో- కన్వీనర్ శివకుమార్ నేత తదితరులు పాల్గొన్నారు...

## కుంకుడు సాగుతో లక్షల ఆదాయం

**నల్గొండ, శుభ తెలంగాణ :** టా ఒకేరకమైన పంటలు సాగు చేయడం వలన దిగుబడి తగ్గుపోతోంది. దీంతో దిగుబడి కోసం రైతులు ఇష్టానుసారం రసాయన మందులు వాడడంతో భూమి నిస్సారం అవుతోంది. దీంతో సాగులో నష్టాలు వస్తున్నాయని చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. కొందరు సాగు వదిలేసి ఇతర పనులు చూసుకుంటున్నారు. పట్టణాలకు వలస పోతు న్నారు. ఈ తరుణంలో కొంతమంది రైతుల వినూత్న పద్ధతిలో పంటలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో, తక్కువ మోతాదులో ఎరువులు వాడి ఎక్కువ దిగుబడి, లాభాలు ఆర్జిస్తున్నారు. వ్యవసాయాధికారుల సహకారం, సాంకేతిక పరిజ్ఞానంతో పంటల పండిస్తున్నారు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నల్గొండ జిల్లాకు చెందిన రైతు నీటి వసతి అంతగా లేని తన పొలంలో సంప్రదాయ పంటలకు భిన్నంగా వ్యవసాయం చేస్తున్నాడు. నీటి వసతి లేదని సాగును వదిలేసే రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. కరువు ప్రాంతంలో ఆయన చేపట్టిన వినూత్న ప్రయోగం.. ఇప్పుడు వారి ఇంట సిరులు కురిపిస్తుంది. సుమారు 33 ఏళ్లుగా ఆదాయం పొందుతున్నాడు. అది కూడా ఎకరాకు రూ.13 లక్షలు. ఎక్కువ సాగుభూమి ఉండి తక్కువ నీటి వసతి ఉన్న రైతులు చాలా మంది తమ పొలాలను బీడుగా వదిలేస్తారు. నల్గొండ జిల్లా రైతు లోకసాని పద్మారెడ్డి మాత్రం నీటి వసతి లేకపోయినా ఎకరాకు కేవలం రూ.5 వేల పెట్టుడితో 33 ఏళ్లుగా ఎకరాకు రూ.13 లక్షల ఆదాయం పొందుతున్నాడు. 12 ఎకరాల్లో పంట పండిస్తూ భారీగా ఆదాయం పొందుతున్నాడు. 33 ఏళ్ల క్రితం 12 ఎకరాల్లో 1,200 కుంకుడు మొక్కలు నాటాడు పద్మారెడ్డి. అప్పుడు అందరు ఆయనను పిచ్చివాడిలా చూశారు. కానీ ఇప్పుడు అదే కుంకుడు తోట మీద ఆయన లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం చూసి నోరె వెల్లబెడుతున్నారు. పద్మారెడ్డి 1991 లో నీటి వసతి పెద్దగా లేని తన 12 ఎకరాల వ్యవసాయ భూమిలో 1,200 కుంకుడు మొక్కలు నాటించాడు. ఇందుకు ఎకరాకు రూ.5 వేల చొప్పున ఖర్చు చేశాడు. వీటి సాగుకు పెద్దగా నీటి అవసరం లేదు. అందుకే పద్మారెడ్డి ఈ ఆలోచన చేశారు. ఆ చెట్లు పెరిగి పెద్దయి నాలుగేళ్ల తర్వాతి నుంచే దిగుబడి ఇవ్వడం మొదలైంది. ఒక్కసారి నాటిన వీఇని మూడు నాలుగేళ్లు శ్రద్ధగా కాపాడుకున్నాడు. ఆ తర్వాత నుంచి అతను ఊహించని విధంగా ఆదాయం వస్తోంది.కుంకుడు సాగులో పద్మారెడ్డి 33 ఏళ్ల అనుభవం గడించాడు. సాగు విధానం గురించి ఆయన చాలా మందికి సూచనలు చేస్తున్నారు. మొక్కల మధ్య 20చీ20 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలంటున్నాడు. వీటికి డ్రిప్‌తో నీటిని అందిస్తే సరిపోతుంది అంటున్నాడు. అంతేకాక కుంకుడు చెట్ల మధ్య తొలి మూడేళ్లు బొప్పాయి, మునగ, జామ వంటి పంటలు వేసుకుంటే రైతుకు అదనపు ఆదాయం వస్తుంది అంటున్నారు. పంట వేసిన నాలుగో ఏట నుంచి 20?30 కిలోల కాపు ప్రారంభమవుతుందన్నారు. ఐదేళ్ల తర్వాత పూత దశలో నీరు ఇస్తే చాలు. మంచి దిగుబడి వస్తుందని తెలిపారు పద్మారెడ్డి.ఏటా కుంకుడు పంట నవంబర్ ? డిసెంబర్ నెలల మధ్య పూతకు వస్తుంది. ఏప్రిల్‌లో కాయలు కోతకు వస్తాయి. కుంకుడు చెట్టు కాపు సీజన్ పూర్తయ్యాక ఆకు రాల్చి నిద్రావస్థలోకి వెళ్తుంది. ఎండిన మానులా ఉండే చెట్టు మేలో చిగురిస్తుంది. ఒక్కో చెట్టుకు 20?25 కిలోల ఆకులు రాలుతాయి. ఆకులన్నీ చెట్టు మొదట్లోనే కుళ్లి సేంద్రియ ఎరువుగా పోషకాలను అందిస్తాయి. కుంకుడు మొక్కలను ఒక్కసారి నాటితే సుమారు 200 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తాయి. కిలో ఎండు కుంకుడు కాయలు రూ.130 పలుకుతోంది.

# శనీశ్వర పూజతో అంతా శుభమే



“నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజంబీ ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్” ! భారతీయుల జ్యోతిషశాస్త్రం ప్రకారం ‘శనీశ్వరుడు’, నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు, కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్నగ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు బిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే ‘శని’ ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనివారానికి అధిపతి శనేశ్వరుడు. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనయే క్రమతి , అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడానికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్రవాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి. సంఖ్యలలో ‘ఎనిమిది’ శనికి ప్రీతికర మయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూపబోతున్నాడో అని నిరూపించ డానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది. దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్థాష్టమ శని, జన్మరాశి నుండి లగ్నశని, మూడు, ఏడు, పదవ స్థానాలపై శనిదేవుని ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు. హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమవాస్య రోజు శని జయంతి జరుపుకుంటారు. వారంలో ఒకరోజు అంటే శనివారం నాడు శనీశ్వరుడు శని గ్రహాన్ని పాలిస్తుంటాడు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. అంతే కాకుండా ఈయన శని గ్రహానికి రాజు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు.కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి. బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాలగణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసు కోలేక, పార్వతీ దేవి తనకుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని పురాణాలు తెలుపు తున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాస మాడాడట ! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్ధించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు. హనుమంతుడు శని దేవుడి లోని ఓంకారాన్ని నాశనం చేసినప్పుడు ఆయన శరీరంపై మచ్చలు గాయాలు అయినాయి. ఆ నొప్పి పోయి, సున్నితంగా తయారవ డానికి, హనుమంతుడు ఇచ్చిన నూనె సాయపడింది.శని దశ దుష్ప్రభావాలతో బాధపడేవారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. నువ్వుల నూనెతో శనికి అభిషేకం చేయడం, శనిత్రయోదశి రోజున ఉపవాసం ఉండడం, రావిచెట్టుకి ప్రదక్షిణాలు చేసి ఆవనూనె తో దీపం పెట్టడం, నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ నూనెను దానం చేయడం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, నల్లని గొడుగు మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి. తాంత్రిక విద్యల ప్రభావం నుంచి రక్షణ కోసం హోమం లేదా యజ్ఞాన్ని జరిపించాలి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు. శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది. శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని “ఏలినాటి శని” లేదా “సాడే సాతి” అంటారు. అలాగే శని నాలుగవ ఇంట, ఎనిమిదవ యింట సంచరిస్తున్నప్పుడు కూడా చెడు ఫలితాలు ఇస్తాడు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఉదాహరణకు ఏ పని లేకుండా, ఖాళీగా తిరుగుతున్న వ్యక్తికి, ఉద్యోగం వస్తే, అది బద్ధకస్తుడు అయిన వ్యక్తికి మొదట కష్టంగా తోచినా, అది మంచి భవిష్యత్తును ఇస్తుంది. కాబట్టి ఆ తర్వాత ఆ కష్టం యొక్క విలువ తెలుస్తుంది. మనం పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది. మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు. శనివారానికి స్థితి కారకుడైన శ్రీమన్నారాయణుడు అధిపతి , త్రయోదశికి అధిపతి కామదేవుడు. అంటే శివుడు. అలా శివకేశవుల క్రియలకు శని అధిపతి అయ్యాడు. అందుకే శనిత్రయోదశి శనికి ఇష్టమైన రోజు. త్రయోదశి తిథి శివుడికి ఎంతో ప్రీతికరమైనది. క్షీరసాగర మదనం జరిగి అమృతం ఉద్భవించిన తరువాత, హాలా హలాన్ని దిగమింగి తన కంఠంలో దాచుకొని లోకాలను కాపాడిన శివుడికి కృత్షతలు చెప్పడానికి దేవతలందరూ ఆయన వద్దకు వెళ్ళినది ఈ త్రయోదశి తిథి నాడే అని పురాణాల ద్వారా తెలుస్తుంది. శని త్రయోదశి ప్రదోష సమయాన శివుడికి అభిషేకం చేయడం చాల విశేషంగా లబిస్తుంది. ఈ సమయంలో శివుడికి చేసే పూజలు అత్యంత ఫలితాలనిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

# అలుపెరుగని పోరాట యోధుడు

భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది. గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 – ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాథం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని



అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929-30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు. ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు.1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు. 1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు. 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

# స్వలింగ సంపర్కంతో మంకీపాక్స్ వ్యాపిస్తుందా!



మంకీపాక్స్ వైరస్‌ను గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. ఈ వ్యాధి ప్రపంచానికి ముప్పుగా అభివర్ణించడం గత రెండేళ్లలో ఇది రెండోసారి. ఇంతకుముందు, దక్షిణాఫ్రికా ఈ వ్యాధిని పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. బుధవారం ఔనూ సమావేశం జరిగింది. దీని తరువాత, మంకీపాక్స్ ప్రపంచ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించబడింది. మంకీపాక్స్ కేసులు నిరంతరం పెరుగుతున్న దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం, ప్రపంచవ్యాప్తంగా మంకీపాక్స్ వైరస్ కేసులు పెరిగాయి. ఆ సమయంలో, ఈ వ్యాధి కేసులు అమెరికా నుండి యూరప్ , భారతదేశంలో కూడా నివేదించబడ్డాయి. దీని తరువాత, ఔనూ ప్రపంచ స్థాయిలో మంకీపాక్స్‌ను పెద్ద ముప్పుగా అభివర్ణించింది. ఇప్పుడు ఈ వైరస్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆఫ్రికాలో మాత్రమే ఎక్కువ కేసులు వస్తున్నప్పటికీ, దీని కారణంగా ఇతర దేశాలలో మంకీపాక్స్ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం కూడా పెరుగుతోంది. మంకీపాక్స్ అనేది కోతుల నుండి మనుషులకు వ్యాపించే వైరస్. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి కూడా వ్యాపిస్తుంది. రక్షణ లేకుండా శారీరక సంబంధాలు పెట్టుకోవడం ద్వారా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. మంకీపాక్స్ సోకిన తర్వాత, జ్వరం వస్తుంది , దద్దుర్లు కనిపిస్తాయి, ఇది శరీరమంతా వ్యాపిస్తుంది. మొట్టమొదట దద్దుర్లు ముఖం మీద కనిపిస్తాయి , తరువాత శరీరం మొత్తం వ్యాపిస్తాయి. స్వలింగ సంపర్కులైన పురుషులలో కోతిపాక్స్ యొక్క ఎక్కువ కేసులు కనుగొనబడ్డాయి. ఈ వైరస్ కూడా మొదట ఆఫ్రికాలో మొదలైంది. మంకీపాక్స్ వైరస్ మళ్లీ యాక్టివ్‌గా మారిందని అంటువ్యాధి నిపుణుడు డాక్టర్ జుగల్ కిషోర్ తెలిపారు. అటువంటి పరిస్థితిలో, జాగ్రత్తగా ఉండవలసిన అవసరం ఉంది. ఈ వైరస్ కూడా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. దాని ఇన్ఫెక్టివిటీ రేటు కోవిడ్ కంటే ఎక్కువగా లేనప్పటికీ, ఆఫ్రికా చుట్టూ ఉన్న దేశాలు ఇంకా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఈ వైరస్ కొన్ని సంవత్సరాల క్రితం కూడా వ్యాపించింది. అటువంటి పరిస్థితిలో, మళ్లీ వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది.

# ఈ సమస్యల నుండి బయటపడాలంటే..!



అత్తి పండ్లను డ్రై ఫ్రూట్స్‌లో లెక్కిస్తారు. ఇది అత్యంత ఆరోగ్యకరమైన , రుచికరమైన పండు. దీన్ని తినడం వల్ల ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. విటమిన్లు, కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రొటీన్, కాల్షియం , పొటాషియం వంటి పోషకాలు అంజీర్‌లో ఉంటాయి. దీన్ని తినడం వల్ల అనేక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనిని ఆరోగ్య నిధి అంటారు. దీన్ని తినడం వల్ల బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుందని సీనియర్ డైటీషియన్ మోహిని డోంగ్రే చెబుతున్నారు. అంజీర పండ్లను తినడం వల్ల కూడా బరువు తగ్గుతారు. అంజీర పండ్లను తినడం వల్ల ఏయే సమస్యలను పరిష్కరించవచ్చో ఇప్పుడు చెప్పండి. మలబద్ధకం : అత్తి పండ్లలో ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. దీంతో మన జీర్ణక్రియ కూడా సరిగ్గా ఉంటుంది. అత్తి పండ్లను క్రమం తప్పకుండా తినడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. బరువు తగ్గడం : మీరు బరువు తగ్గాలనుకుంటే, మీ రోజువారీ ఆహారంలో అత్తి పండ్లను చేర్చుకోండి. ఇది తక్కువ కేలరీలను కలిగి ఉంటుంది, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దీన్ని తినడం వల్ల శరీరంలో మెటబాలిజం కూడా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో, ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర : డయాబెటిక్ రోగులకు అంజీర్ పండ్లను తినడం చాలా ఉపయోగకరంగా ఉంటుందని మీకు తెలియజేద్దాం. నానబెట్టిన తర్వాత తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆకస్మిక రక్తం స్పైక్‌ను నివారించడంలో సహాయపడుతుంది. అయితే, వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే తినండి. రక్తపోటు : మీరు అధిక రక్తపోటు సమస్యతో పోరాడుతున్నట్లయితే, మీ ఆహారంలో అత్తి పండ్లను చేర్చుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో పొటాషియం చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు అత్తి పండ్లను పూర్తిగా ఉపయోగించాలనుకుంటే, వాటిని నానబెట్టి తినండి. రాత్రంతా నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినండి. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

# ఆల్కహాల్ సడన్‌గా మానేస్తే ఏమవుతుంది?

మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా కూడా చాలామంది మద్యం సేవించడం ఆపరు. ఈ రోజుల్లో చిన్న పిల్లలు కూడా మద్యం సేవిస్తూ ఉన్నారు. కొంతమంది అయితే చిన్న వయసులోనే ఆల్కహాల్ కి బాగా ఎడిక్ట్ అయిపోయారు. మరి ముఖ్యంగా సిటీలో ఉన్న పిల్లలు పార్టీ కల్చర్ కి బాగా అలవాటు పడిపోయి చిన్న వయసులోనే ఈ మధ్య అలవాటును నేర్చుకున్నారు. అయితే కొంతమంది చాలా రకాల కారణంగా ఉన్నఫలంగా మద్యం తాగడం మానేస్తూ ఉంటారు. మద్యం తాగడం మానేయడం మంచిదేనా? ఒక్కసారిగా మద్యం మానడం మానేస్తే ఏం జరుగుతుందో,ఎలాంటి ఫలితాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఒక్కసారిగా ఆల్కహాల్ తీసుకోవడం లేదా తగ్గించడం లేదా వదులుకోవడం ఇలాంటివి చేస్తే శరీరంలోని అధిక రక్తపోటును పూర్తిగా తొలగిపోతుందట. ఆల్కహాల్ తీసుకోవడం వల్ల శరీరంలో ట్రైగ్లిజరైడ్స్ అనే కొవ్వు స్థాయి పెరుగుతుంది. ఇది గుండె వైఫల్యానికి దారితీస్తుందట. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఆల్కహాల్ తీసుకోవడం మానుకోవాలి. అయితే ఒకేసారి పూర్తిగా మానేయకుండా, కొద్ది కొద్దిగా అలవాటుకు దూరం కావాలి. కాలేయం సహాయంతో శరీరంలోని విష పదార్థాలను సులభంగా నిర్విషీకరణ చేయవచ్చు.



# బ్రేక్ ఫాస్ట్‌ని స్కిప్ చేస్తున్నారా?



ఆరోగ్యంగా ఉండాలి అంటే సరైన పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. అదేవిధంగా మూడు పూటలా సమయానికి భోజనం చేసినప్పుడే ఆరోగ్యం బాగా ఉంటుంది. కానీ కొంతమంది మాత్రం ఉదయం సమయంలో బ్రేక్ ఫాస్ట్ స్కిప్ చేస్తూ ఉంటారు. రాత్రి ఆలస్యంగా పడుకోవడం వల్ల ఉదయాన్నే ఎప్పుడో 9,10,11 గంటలకు నిద్ర లేచి ఆ సమయంలో బ్రష్ చేసి బ్రేక్ ఫాస్ట్ కి బదులుగా డైరెక్ట్ గా లంచ్ చేస్తూ ఉంటారు. కానీ అలా చేయడం అసలు మంచిది కాదు అని చెబుతున్నారు వైద్యులు. ముఖ్యంగా ఉదయం కచ్చితంగా బ్రేక్ ఫాస్ట్ తీసుకోవాలని, లేదంటే అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతున్నారు. శరీరంలో మెటబాలిజంను ప్రారంభించడంలో బ్రేక్ ఫాస్ట్ యే కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాదు మంచి హెల్తీ ఫుడ్ మన ఏకాగ్రతను పెంచుతుంది. అలాగే మనల్ని రోజంతా ఎనర్జిటిక్ గా ఉంచేలా చేస్తుంది. ఒకవేళ ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ ని స్కిప్ చేస్తే ఎలాంటి సమస్యలు వస్తాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఉదయం తినకపోతే బరువు పెరగడం, పోషకాల లోపాలతో పాటుగా ఎన్నో రోగాల ముప్పు కూడా ఉందట. కాబట్టి మొత్తం ఆరోగ్యం శ్రేయస్సు కోసం ఉదయం బ్రేక్ ఫాస్ట్ ను ఖచ్చితంగా తినాలి. బ్రేక్ ఫాస్ట్ ను తినేవారు తినని వారికంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారట. బ్రేక్ ఫాస్ట్ మన మెదడును ఆరోగ్యంగా, షార్ప్ గా ఉంచుతుంది. ఇది మన జ్ఞాపకశక్తిని కూడా మెరుగుపరుస్తుంది. అంతేకాదు మనల్ని బలంగా, పదునుగా మారుస్తుందని చెబుతున్నారు. అలాగే పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వు, ప్రోటీన్ ఉన్న ఆహారాలను తింటే మన ఏకాగ్రత పెరుగుతుందట. తృణధాన్యాలు, ప్రోటీన్, ఫైబర్, మంచి కొవ్వులు ఎక్కువగా ఉన్న ఆహారాలు మీ శరీరానికి శక్తిని అందించడానికి సహాయపడతాయని చెబుతున్నారు. అంతేకాదు బ్రేక్ ఫాస్ట్ మీ శరీరాన్ని రోజంతా ఎనర్జిటిక్ గా ఉంచుతుంది. ఉదయాన్నే భోజనం మానేయడం వల్ల బరువు తగ్గుతామని చాలా మంది నమ్ముతారు. కానీ ఇది ఒక అపోహ మాత్రమే.

# ఉదయాన్నే జామ పండు తింటున్నారా?

జామపండు వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. జామ పండులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అలాగే ఎన్నో రకాల పోషకాలు కూడా జామలో ఉన్నాయి. అందుకే జామకాయను పేదవాడి యాపిల్ అని పిలుస్తారు. జామ పండు ఎన్నో రకాల వ్యాధులకు గొప్ప ఔషధంలా పనిచేస్తుంది. జామ పండు రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి కలిగిస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జామలో ఫైబర్ కూడా లభిస్తుంది. ఇది జీర్ణక్రియను ఆరోగ్యంగా చేసేందుకు, మలబద్దకాన్ని నివారించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇలాంటి జామ పండును పరగడుపున తీసుకోవడం వల్ల ఏం జరుగుతుందో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. జామలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది మన రోగ నిరోధక శక్తిని బలోపేతం చేసి జలుబు, ఫ్లూ వంటి వ్యాధుల నుంచి రక్షిస్తుంది. జామలో ఉండే ఇతర యాంటీ ఆక్సిడెంట్లు కూడా మన శరీరాన్ని వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షిస్తుంది. జామలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి రోజు ఉదయాన్నే జామ పండు తినడం వల్ల మలబద్ధకం సమస్యల నంచి విముక్తి కలిగిస్తుంది. అలాగే జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. జామలో ఉండే ఇతర పోషకాలు కూడా జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడతాయి. అలాగే జామలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. అదే విధంగా ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. జామలో ఉండే మోనోఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ కూడా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఉదయాన్నే జామపండు తినడం వల్ల విటమిన్లు , ఫైబర్ మోతాదుతో మీ రోజును ప్రారంభించడానికి గొప్ప మార్గం. జామలోని సహజ చక్కెరలు శీఘ్ర శక్తిని



Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110